వికారాబాద్‌లో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు మెతుకు ఆనంద్ ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

షరతులు లేకుండా రుణమాఫీ చేయాలి

- రుణమాఫీకాని రైతులు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల చుట్టూ ప్రదక్షిణలు
- రుణమాఫీపై సీఎం, మంత్రులది తలోమాట
- జిల్లాలో ఏ ఒక్కగ్రామంలోనూ వంద శాతం రుణమాఫీ కాలేదు
- స్పీకర్‌కు వచ్చిన రుణమాఫీ డబ్బులు రైతులకు ఎందుకు రాలేదు
- బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

వికారాబాద్, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : ఏ షరతులు లేకుండా రుణమాఫీ చేయాలని, మీరు హామీ ఇచ్చినప్పుడు ఏమైనా షరతులు పెట్టారా, ఐటీ చెల్లించేవారికి రుణమాఫీ చేయబోమని చెప్పిండ్రా, ఇవేవి చెప్పకుండా ఆంక్షలు పెట్టడం సరికాదని, ఎలాంటి ఆంక్షలు లేకుండా రుణమాఫీ చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్ డిమాండ్ చేశారు. రుణమాఫీకి సంబంధించి ఎలాంటి ఆంక్షలు లేకుండా మాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఇచ్చిన పిలుపు మేరకు గురువారం ఆనంద్ ఆధ్వర్యంలో వికారాబాద్‌లోని ఎమ్మార్పీ పెట్రోల్ పంప్ నుంచి ఎన్టీఆర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించి, అనంతరం రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వికారాబాద్ నియోజకవర్గంలో ఏ గ్రామంలో కూడా వంద శాతం రుణమాఫీ పూర్తి కాలేదని, కానీ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌కు రూ.1.58 లక్షల రుణమాఫీ అయ్యిందని, స్పీకర్‌కు వచ్చిన రుణమాఫీ డబ్బులు రైతులకు ఎందుకు రాలేదని ప్రశ్నించారు, స్పీకర్ రైతు కావచ్చని, ఆయనకు రావద్దని మేం అనడం లేదన్నారు. స్పీకర్ రుణమాఫీ డబ్బులను వాపస్ ఇచ్చినప్పటికీ రైతులకు కూడా కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల ముందు చెప్పిన విధంగా రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సీఎం రుణమాఫీ పూర్తయిందని చెప్తుంటే, మంత్రులు మాత్రం ఒక్కొక్కరు ఒక్కో మాట చెప్తూ రైతులను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. ఓవైపు రైతులు రుణమాఫీ కాకపోవడంతో వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల ఎదుట ధర్నాలు చేస్తుంటే అవేవీ పట్టని కాంగ్రెస్ నాయకులు ముఖ్యమంత్రి చిత్రపటానికి క్షీరాభిషేకాలు చేస్తున్నారని మండిపడ్డారు. సంబురాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు తప్ప రైతులు చేయడంలేదని, రైతులు ధర్నాలు చేస్తున్నారన్నారు.

రైతులను బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు రెచ్చగొడుతున్నారని ఆరోపణలు చేస్తున్నారని.. కానీ రైతులు స్వచ్ఛందంగా రైతులు వ్యవసాయ కార్యాలయాలు, బ్యాంకుల వద్ద ధర్నాలు చేస్తున్నారన్నారు. కాంగ్రెస్ నాయకులు ఒకసారి వ్యవసాయ కార్యాలయాలకు వెళ్లి రైతు రుణమాఫీ గురించి నిజాలు బ్యాంకుల ఎదుట రైతుల గోసలు తెలుసుకుంటే బాగుంటుందన్నారు.

రాష్ట్రంలో 40 శాతం మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. రాష్ట్ర మంత్రులు చెప్పేదానికి రైతు రుణ మాఫీకి ఎక్కడా పొంతన లేదన్నారు. ముందు రుణ మాఫీ కోసం రూ.49 వేల కోట్లు అవసరమని చెప్పిన కాంగ్రెస్ నాయకులు దాన్ని ఇప్పుడు రూ.7500 కోట్లకు సరిపెట్టారని, ఈ విషయం స్వయానా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క తెలిపారన్నారు. రూ.2లక్షల రుణమాఫీ అయిపోయిందని చెప్పుకుంటూ, మరో వైపు సాంకేతిక కారణాలతో ఎక్కడైనా కాలేదెమో నంటూ చెప్తూ రైతులను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. మాజీ సీఎం కేసీఆర్ కుటుంబంపై విమర్శలు మానుకొని వెంటనే అభివృద్ధిపై దృష్టి పెట్టాలని, రైతులకు మేలు చేసే కార్యక్రమాలను చేపట్టాలన్నారు. ప్రజలకిచ్చిన హామీలను నెరవేర్చకపోతే బీఆర్‌ఎస్ పార్టీ ప్రజల తరపున పోరాటం చేస్తుందని ఆయన హెచ్చరించారు.

మరోవైపు సచివాలయం ఎదుట తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని బీఆర్‌ఎస్ ఆలోచన చేస్తే, ఇప్పుడు అక్కడ తెలంగాణకు సంబంధంలేని రాజీవ్‌గాంధీ విగ్రహం పెడుతామని కాంగ్రెస్ నాయకులు అనడంలో ఏమైనా అర్థం ఉందా అని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకులు రాజీవ్‌గాంధీ విగ్రహం పెట్టే ఆలోచనను మానుకోవాలని, సెక్రటేరియేట్ ఎదుట కచ్చితంగా తెలంగాణ తల్లి విగ్రహం పెట్టాలని డిమాండ్ చేశారు.

నిరసన కార్యక్రమంలో కౌన్సిలర్లు అనంత్‌రెడ్డి, గోపాల్, బీఆర్‌ఎస్ నాయకులు ప్రభాకర్‌రెడ్డి, పురుషోత్తంరెడ్డి, దేవదాస్, షకీల్ పాల్గొన్నారు.

ఇబ్రహీంపట్నంలో బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడుమంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఆందోళన చేస్తున్న బీఆర్‌ఎస్ శ్రేణులు

రుణమాఫీ పెద్ద బూటకం

- హామీలను అమలు చేయని అసమర్థ ప్రభుత్వమిది
- బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి
- రైతులందరికీ రుణమాఫీ చేయాలని పట్నంలో రాస్తారోకో

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 22 : రైతు రుణమాఫీ పెద్ద బూటకమని, రైతుల పట్ల సీఎం రేవంత్‌కు ఏమాత్రం చిత్తశుద్ధి ఉన్నా రైతులందరికీ బేషరతుగా 2లక్షల రుణ మాఫీ చేయాలని బీఆర్‌ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి అన్నారు. ఎటువంటి ఆంక్షలు లేకుండా రాష్ట్రంలో ఉన్న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తా వద్ద బీఆర్‌ఎస్ శ్రేణులు గురువారం ఆందోళనకు దిగారు. బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ పిలుపు మేరకు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి సమక్షంలో రాస్తారోకో నిర్వహించారు. గులాబీ శ్రేణుల ఆందోళనతో సాగర్ రహదారి స్తంభించిపోయింది. సీఎం డౌన్‌డౌన్ అనే నినాదాలతో పట్నం నియోజకవర్గ కేంద్రం దద్దరిల్లింది.

ఈ సందర్భంగా మంచిరెడ్డి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. ఎన్నికల ముందిచ్చిన హామీలను సక్రమంగా అమలుచేయని అసమర్థ ప్రభుత్వం కాంగ్రెస్ అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతులందరి రుణ మాఫీ వర్తించే వరకు కాంగ్రెస్ సర్కారు మెడలు వంచుతామన్నారు. ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని గొప్పలు చెప్పిన ప్రభుత్వం మూడు విడతల్లోనూ కనీసం 40 శాతం రైతులు రుణమాఫీకి నోచుకోలేదని మండిపడ్డారు. రైతు రుణమాఫీ విషయంలో సీఎం రేవంత్ దేవుళ్లను కూడా మోసం చేశారన్నారు. నిబంధనల పేరుతో ఎంతో మంది రైతులకు రుణమాఫీ చేయకపోవడం సిగ్గు చేటన్నారు. రుణమాఫీ పూర్తయిందని సీఎం చెబుతుంటే ఇంకా ఉందని మంత్రులు చెప్పడం హాస్యాస్పదమన్నారు. అనవసరంగా రైతులను అయోమయానికి గురిచేయడం మానుకొని అర్హులైన ప్రతి రైతుకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. రైతు రుణమాఫీ పెద్ద బూటకమని, సీఎం రేవంత్‌రెడ్డికి చీమూ నెత్తురుంటే ఇచ్చిన మాటను నిలబెట్టుకోవాలని సవాల్ విసిరారు. లేదంటే ఆందోళనలు మరింత ఉధృతం చేసి కాంగ్రెస్ పాలనను స్తంభింపచేస్తామని హెచ్చరించారు. రైతుల పట్ల నిర్లక్ష్య ధోరణిని అవలంబిస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వానికి తిరిగి రైతులే తగిన గుణపాఠం చెబుతారన్నారు.

ఆరు గ్యారెంటీల పేరుతో అధికారంలోకి వచ్చి వాటిని సక్రమంగా అమలు చేయకుండా సీఎం రేవంత్ రాష్ట్ర ప్రజలను మోసం చేశారన్నారు. ఆడపడుచులకు కల్యాణలక్ష్మితోపాటు తులం బంగారం వెంటనే అందజేయాలన్నారు. ప్రతి మహిళకు రూ.2500 ప్రతి నెలా అందించాలని, ఆసరా పింఛన్‌లను వెంటనే పెంచాలని, గతంలో మాదిరిగా రైతు బంధు, రైతు బీమా పథకాలను కొనసాగించాలని, దళిత బంధు పథకంతో దళితులను ఆదుకోవాలని ఆయన కోరారు. గ్రామాల్లో ప్రత్యేక పాలనలో పారిశుధ్యం అస్తవ్యస్థంగా మారిందన్నారు. గ్రామాల్లో అనేక సమస్యలతో ప్రజలు సతమతమవుతున్నారన్నారు.

బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్‌తో పాటు కేటీఆర్, హరీశ్‌రావు పట్ల అసభ్యకరంగా మాట్లాడితే ఊరుకునేదిలేదన్నారు. సీఎం రేవంత్ నోరు, ఒళ్లు దగ్గర పెట్టుకుంటే మంచిదని హెచ్చరించారు. లేదంటే ఆయనకు రోజులు దగ్గరపడినట్లేనన్నారు. రానున్నది బీఆర్‌ఎస్ ప్రభుత్వమేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎనిమిది నెలల్లోనే కాంగ్రెస్ ప్రభుత్వంపై రాష్ట్ర ప్రజలు విసుగు చెందినట్లు ఆయన పేర్కొన్నారు.

కార్యక్రమంలో బీఆర్‌ఎస్ రాష్ట్ర నాయకుడు ప్రశాంత్‌రెడ్డి, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ వెంకటరమణారెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చంద్రయ్య, మాజీ ఎంపీపీ కృపేష్, మాజీ జడ్పీటీసీ రమేశ్, సింగిల్ విండో చైర్మన్ రాజేందర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షులు బుగ్గరాములు, రమేశ్, కిషన్‌గౌడ్, పార్టీ నాయకులు యాదగిరి, భరత్, సుల్తాన్, శంకర్, జగదీశ్, భాస్కర్‌రెడ్డి, బహదూర్, పాశ్చా బాషా, ప్రవీణ్, మహేశ్ పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేరాల కట్టడి

ఎస్పీ నారాయణరెడ్డి

బొంరాస్‌పేట, ఆగస్టు 22 : గ్రామల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకుంటే నేరాలను కట్టడి చేయవచ్చని ఎస్పీ నారాయణ రెడ్డి అన్నారు. గురువారం బొంరాస్‌పేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన సందర్శించారు. వివిధ కేసులకు సంబంధించిన ఫైళ్లను పరిశీలించారు. పోలీస్‌స్టేషన్ ఆవరణలో పోలీసుల గౌరవ వందనం స్వీకరించి మొక్కలు నాటారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ.. సీసీ కెమెరాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని, ప్రజా ప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో ప్రజలు గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. సీసీ కెమెరాల వల్ల నేరస్తులను గుర్తించడానికి అవకాశం కలుగుతుందన్నారు. ఆత్మహత్యలపై కళాబృందాలతో అవగాహన కల్పిస్తామని, చనిపోయే కంటే బతికి సాధించాలనేదానిపై ధైర్యం నింపాలని చెప్పారు. పోక్సో కేసులపై కూడా ప్రజల్లో అవగాహన కల్పిస్తామని, బాల్య వివాహాలపై ప్రజలకు పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్పీ సూచించారు. జాతీయ రహదారులు, ఆర్‌అండ్‌బీ రోడ్లపై ప్రమాదాల నివారణకు సంబంధిత అధికారులతో చర్చించి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఎక్కువ శాతం ప్రమాదాలు మద్యం తాగి వాహనాలు నడపడం వల్లనే జరుగుతున్నాయని, అవి కూడా సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 8 గంటల మధ్య జరుగుతున్నాయని, డ్రంక్ అండ్‌డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేస్తామన్నారు. గంజాయి వినియోగించేవారు, అమ్మేవారి సమాచారం పోలీసులకు అందజేయాలని ఎస్పీ సూచించారు. గుప్త నిధుల తవ్వకంలో ప్రాణాలు కోల్పోయిన వ్యక్తిని రోడ్డు ప్రమాదంగా చిత్రీకరించిన కేసును ఛేదించిన కానిస్టేబుళ్లు శ్రీనివాస్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్‌లకు ఎస్పీ నారాయణరెడ్డి రివార్డులను అందజేశారు. సమావేశంలో పరిగి డీఎస్పీ కరుణాసాగర్‌రెడ్డి, కొడంగల్ సీఐ శ్రీధర్‌రెడ్డి, ఎస్సై అబ్దుల్ రవూఫ్, ఏఎస్సై కమాల్‌రెడ్డి, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

సొంత గూటికి బీఆర్‌ఎస్ శ్రేణులు


అల్లవాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్, చిత్రంలో మాజీ మంత్రి సబితారెడ్డి

కాంగ్రెస్ పార్టీ నాయకుడు తోట శేఖర్‌కు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి కేటీఆర్

చేవెళ్లటౌన్, అగస్టు 22 : చేవెళ్లలోని వేంకటేశ్వరస్వామి ఆలయం వెనుక నిర్వహించిన రుణమాఫీపై గురువారం ప్రభుత్వ తీరుకు నిరసన చేపట్టిన దీక్షకు ముఖ్య అతిథులుగా వచ్చిన బీఆర్‌ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ సమక్షంలో మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అధ్వర్యంలో అల్లవాడ మాజీ ఎంపీటీసీ సత్యనారాయణచారి, కాంగ్రెస్ పార్టీ నాయకులు తోట శేఖర్ బీఆర్‌ఎస్ పార్టీలోకి చేరారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి కేటీఆర్ వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.

కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ కృష్ణారెడ్డి, రాష్ట్ర కనీస వేతనాల సంస్థ మాజీ చైర్మన్ నారాయణ, మాజీ ఎంపీపీ బాల్‌రాజ్, పార్టీ మండల అధ్యక్షుడు ప్రభాకర్, షాబాద్ మాజీ జడ్పీటీసీ అవినాష్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ శివప్రసాద్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్లు వెంకటేశ్, ఘని, నాయకులు మహేశ్, రాంప్రసాద్ ఉన్నారు.

అందుబాటులోకి ఈ-ఆఫీస్ సేవలు

ప్రారంభించిన రంగారెడ్డి కలెక్టర్ శశాంక


కలెక్టరేట్‌లో 'ఈ-ఆఫీస్'ను ప్రారంభిస్తున్న కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా కలెక్టరేట్‌లో 'ఈ-ఆఫీస్'ను కలెక్టర్ శశాంక, అదనపు కలెక్టర్ ప్రతిమాసింగ్‌తో కలిసి గురువారం లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. కలెక్టరేట్ కార్యాలయంలో ఇక కాగితాలు, ఫైళ్లు ఉండవని, అంతా ఎలక్ట్రానిక్ మయమేనని అన్నారు. కార్యకలాపాలను ప్రస్తుతం మొదటి విడతగా వ్యవసాయం, ముఖ్య ప్రణాళిక, పంచాయతీ రాజ్, మైనార్టీ సంక్షేమం, ఎంఎ అండ్ యూడీ మెప్మా, మహిళా శిశు దివ్యాంగులు, సీనియర్ సిటిజన్, ఎస్సీ అభివృద్ధి, డీఆర్‌డీఏ శాఖల్లో అందుబాటులోకి తెచ్చినట్లు తెలిపారు. ఇప్పటి నుంచి 8 డిపార్ట్‌మెంట్లలో ప్రతి ఫైల్‌ను 'ఆన్‌లైన్'లోనే పంపాలన్నారు. ఇంకా మిగిలిన జిల్లా అధికారులు కూడా వచ్చే మూడు నెలల్లోగా ఈ-ఆఫీస్‌ను అమలు చేయాలన్నారు. ఇకపై ఫైళ్లను ఎక్కడి నుంచైనా తనిఖీ చేసేందుకు అవకాశం ఉంటుందన్నారు. అత్యవసరమనుకున్న ఫైల్‌ను అసిస్టెంట్ సెక్షన్ అధికారి నుంచి కలెక్టర్ వరకు అరగంటలో పంపవచ్చన్నారు. అంతే వేగంగా ఫైళ్లను క్లియర్ చేసే అవకాశం 'ఈ-ఆఫీస్ ' విధానంలో ఉంటుందన్నారు. కార్యక్రమంలో డీఆర్వో సంగీత, ఏవో సునీల్, సీపీవో సౌమ్య, సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ రామారావు, మైనార్టీ శాఖ అధికారి నవీన్‌కుమార్‌రెడ్డి, డీసీసీవో ధాత్రీదేవి పాల్గొన్నారు.

స్కాలర్‌షిప్‌లకు దివ్యాంగ విద్యార్థుల నుంచి దరఖాస్తుల ఆహ్వానం

జిల్లా సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి

వికారాబాద్, ఆగస్టు 22 : 2024-25 విద్యా సంవత్సరంలో ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్, పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్, టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ పథకంలో భాగంగా నేషనల్ స్కాలర్‌షిప్ ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఫ్రెష్, రెన్యువల్‌కు దరఖాస్తు చేసుకోవాలని జిల్లా మహిళా, శిశు దివ్యాంగుల, వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారి కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమ శాఖ సంచాలకుల కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయన్నారు. స్కాలర్‌షిప్ కోసం www.depwd.gov.in, ఆన్‌లైన్ పోర్టల్ https://scholarship.gov.inలో మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు.

* ప్రీ మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం 9, 10 తరగతుల విద్యార్థులు అర్హులు, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 31-08-2024.
* పోస్టు మెట్రిక్ స్కాలర్‌షిప్ కోసం 6, 8 తరగతుల విద్యార్థులు అర్హులు, దరఖాస్తు చేసుకోవడానికి చివరి తేదీ 31-10-2024.
* టాప్ క్లాస్ ఎడ్యుకేషన్ కోసం డిగ్రీ, పీజీ, డిప్లొమా విద్యార్థులు అర్హులు, దరఖాస్తు చేసుకొనుటకు చివరి తేదీ 31-10-2024.

అర్హులైన దివ్యాంగ విద్యార్థులందరూ ఈ పథకాన్ని వినియోగించుకోవాలని ఆమె తెలిపారు.

కేజీబీవీలలో కాంట్రాక్టు ఉద్యోగులకు బదిలీలు

జిల్లా విద్యాధికారి రేణుకాదేవి

వికారాబాద్, ఆగస్టు 22 : వికారాబాద్ జిల్లాలోని 18 కేజీబీవీలలో కాంట్రాక్టు పద్ధతి ద్వారా పని చేస్తూ, బదిలీలు కోరుకుంటున్న SO, PGCRT, CRT, PET, ANM, ACCOUNTANTలను ఇతర కేజీబీవీలకు బదిలీ చేసేందుకు రాష్ట్ర సమగ్ర శిక్షా ప్రాజెక్టు డైరెక్టర్ ద్వారా ఉత్తర్వులు అందాయని జిల్లా విద్యాధికారి రేణుకాదేవి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. https://schooledu.telangana.gov.in/ISMS/website ద్వారా ఆన్‌లైన్‌లో కొత్త జిల్లాల ప్రాతిపదికన బదిలీలు జరుగుతాయన్నారు. రెండు సంవత్సరాలు ఒకే కేజీబీవీలో సర్వీస్ పూర్తయిన SO, PGCRT, CRT, PET, ANM, ACCOUNTANTలు లబ్ధి పొందనున్నారన్నారు. ఈ ప్రక్రియ 22.08.2024 నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణతో ప్రారంభమై 05.09.2024న కొత్తగా బదిలీలు పొందిన కేజీబీవీలలో కాంట్రాక్టు పద్ధతిన ప్రవేశించడం ద్వారా ముగుస్తుందని ఆమె తెలిపారు.

కేసులు తగ్గే వరకు మెడికల్ క్యాంప్

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్


మెడికల్ క్యాంపును సందర్శించిన జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ పాల్వన్‌కుమార్

వికారాబాద్, ఆగస్టు 22 : కల్తీ కల్లు బాధితులు పూర్తిగా కోలుకునే వరకు పీరంపల్లి గ్రామంలో మెడికల్ క్యాంపు నిర్వహించనున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పాల్వన్ కుమార్ తెలిపారు. గురువారం వికారాబాద్ మండల పరిధిలోని పీరంపల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపును సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మూడు రోజులుగా పీరంపల్లిలో హెల్త్ క్యాంపు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బాధితులు క్రమంగా కోలుకుంటున్నారని చెప్పారు. హెల్త్ క్యాంపులో 38 మందికి ప్రాథమిక చికిత్సలు చేయగా.. వారిలో 11 మందికి వివిధ పరీక్షల నిమిత్తం రక్త నమూనాలు సేకరించి, ఇద్దరిని వికారాబాద్ జిల్లా ఆసుపత్రికి రెఫర్ చేయడం జరిగిందని తెలిపారు. జాగ్రత్తలు పాటించినట్లయితే అనారోగ్యానికి గురికాకుండా ఉండవచ్చని తెలిపారు. కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని, రోడ్లపై బహిరంగంగా లభించే చిరుతిళ్లు తినరాదని సూచించారు. తినే ఆహార పదార్థాలపై మూతలు పెట్టి ఉంచాలని, వేడివేడి ఆహార పదార్థాలను మాత్రమే భుజించాలని తెలిపారు. భోజనానికి ముందు, మలవిసర్జన తర్వాత చేతులను సబ్బుతో శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. ఏమాత్రం అనారోగ్యంగా అనిపించినా వెంటనే గ్రామంలో ఏర్పాటు చేసిన హెల్త్ క్యాంపులో చూపించుకోవాలన్నారు. హెల్త్ క్యాంపులో అన్ని రకాల మందులు అందుబాటులో ఉన్నాయని, అవసరమైతే జిల్లా ఆసుపత్రికి తరలించడానికి 108 సేవలను వినియోగించుకోవాలని ఆయన పీహెచ్‌సీ వైద్యాధికారిని ఆదేశించారు.

ఫ్లిప్‌కార్ట్‌లో ఉద్యోగాలు

జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్

వికారాబాద్, ఆగస్టు 22 : ఫ్లిప్‌కార్ట్‌లో పలు ఉద్యోగాలు ఖాళీగా ఉన్నాయని జిల్లా ఉపాధి కల్పనా అధికారి షేక్ అబ్దుస్ సుభాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా ఎంప్లాయిమెంట్ కార్యాలయం, వికారాబాద్ ఐటీఐ క్యాంపస్‌లో ఆగస్టు 23 శుక్రవారం ఉదయం 10:30 గంటలకు జాబ్ మేళాను నిర్వహించనున్నట్లు చెప్పారు. సుమారు 100 డెలివరీ ఎగ్జిక్యూటివ్ పోస్టులు ఉన్నాయని, వీటికి అబ్బాయిలు మాత్రమే అర్హులన్నారు. ఈ ఉద్యోగానికి పదో తరగతి అంతకంటే ఎక్కువ విద్యార్హతలు కలిగి ఉండాలన్నారు. ఇతర వివరాలకు జాబ్ మేళా నిర్వాహకుడు మియాసాబ్ 9676047444ను సంప్రదించాలని ఆయన సూచించారు.

మెడికల్ కాలేజీలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలి

రంగారెడ్డి కలెక్టర్ శశాంక

రంగారెడ్డి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : మహేశ్వరం మెడికల్ కాలేజీలో వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ శశాంక అధికారులను ఆదేశించారు. గురువారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ భవనంలోని కలెక్టర్ ఛాంబర్‌లో మహేశ్వరం మెడికల్ కాలేజీ నిర్వహణపై కలెక్టర్ శశాంక సంబంధిత అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. మెడికల్ కాలేజీలో అందుబాటులోకి తీసుకురావాల్సిన పరికరాలను సమకూర్చడంతోపాటు కాలేజీ వసతుల ఏర్పాట్లను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. మొదటి లెవల్ కాలేజీలో మొదటి లెవల్‌లో జరగాల్సిన నియామక ప్రక్రియను పూర్తి చేయడం జరిగిందని తెలిపారు. ఇంకా జరగాల్సిన నియామకాలను పూర్తి చేసేలా కాలేజ్ ప్రిన్సిపాల్ చర్యలు చేపట్టాలన్నారు. సివిల్ పనులు, సిబ్బంది నియామకం, ల్యాబ్‌లు, హాస్టల్ వసతులు తదితర సంబంధిత పనుల పూర్తికి కాలపరిమితిని విధించుకోవాలని తెలంగాణ మెడికల్ అండ్ హెల్త్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఇబ్రహీంపట్నం ఆర్డీవో అనంత రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ శ్రీరాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ రవీందర్, మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ త్రివేణి, సూపరింటెండెంట్ నాగేందర్, జిల్లా ఆసుపత్రుల సమన్వయకర్త రాజుయాదవ్, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

పౌరసరఫరాల శాఖ డీఎంగా గోపీకృష్ణ



రంగారెడ్డి, ఆగస్టు 22 (నమస్తే తెలంగాణ) : రంగారెడ్డి జిల్లా పౌరసరఫరాల శాఖ జిల్లా మేనేజర్‌గా గోపీకృష్ణ గురువారం తన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన విజయలక్ష్మి బదిలీపై వెళ్లగా.. ఆమె స్థానంలో యాదాద్రి భువనగిరి జిల్లా నుంచి గోపీకృష్ణ బదిలీపై వచ్చారు. పదవీ బాధ్యతల స్వీకరణ సందర్భంగా కలెక్టర్ శశాంకను మర్యాదపూర్వకంగా కలిసి జాయినింగ్ రిపోర్ట్‌ను అందజేశారు.

సాంకేతికతతో ఉన్నత శిఖరాలు


ఓరియంటేషన్ ప్రోగ్రాం ప్రారంభోత్సవంలో కాలేజీ ప్రతినిధులు

పెద్దఅంబర్‌పేట, ఆగస్టు 22: ఆధునిక సాంకేతిక విద్యతో ఐటీలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని టీసీఎస్ జనరల్ మేనేజర్, హెచ్‌ఆర్ హెడ్ శ్రీకాంత్ అన్నారు. మున్సిపాలిటీ పరిధి తట్టిఅన్నారంలోని శ్రేయస్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ (అటానమస్)లో గురువారం 14వ ఓరియంటేషన్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన శ్రీకాంత్ మాట్లాడుతూ.. మానవ నైపుణ్యాలు ఎంత ముఖ్యమో, నిజాయతీ కూడా అంతే ముఖ్యమని చెప్పారు. కాలేజీ వైస్ చైర్మన్ హృదయ్‌రెడ్డి మాట్లాడుతూ.. కాలానికి అనుగుణంగా సాంకేతికతను అందిపుచ్చుకోవాలని అన్నారు.

24న ఉద్యోగ మేళా

రంగారెడ్డి జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి జయశ్రీ

షాబాద్, ఆగస్టు 22 : రంగారెడ్డి జిల్లాలోని నిరుద్యోగ యువతకు ప్రైవేట్ రంగంలో ఉద్యోగాలు కల్పించేందుకు ఈ నెల 24న ఉదయం 10:30 నుంచి 2:30 గంటల వరకు జిల్లా ఉపాధి కార్యాలయంతో ఉద్యోగ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి కల్పనా కార్యాలయ అధికారి జయశ్రీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. హైదరాబాద్‌లో రిటైల్, ఈకామర్స్, బీపీవో రంగాల్లో పోస్టులు ఉన్నట్లు చెప్పారు. విద్యార్హత టెంత్, ఇంటర్, డిగ్రీ, ఐటీఐ, డిప్లొమా, జీఎన్‌ఎం, ఏఎన్‌ఎం, బీ-ఫార్మసీ పూర్తి చేసి ఉండాలన్నారు. వయస్సు 18-30 ఏండ్లు ఉండాలన్నారు. వివరాలకు జిల్లా ఉపాధి కార్యాలయం, శాంతినగర్ ఐటీఐ క్యాంపస్, మల్లేపల్లి, ఫోన్ 9063099306ను సంప్రదించాలన్నారు.